

# నన్ను అర్థం చేసుకుంటావు కదూ!

తెనాలి సుశీలాదేవి

అద్దంలో చూసుకుంటూ తలదువ్వుకుంటున్న కృష్ణ వులిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు.

"ఏరా నానీ!" ప్యాంటు పట్టుకుని లాగుతున్న నానిని అడిగాడు.

"బాబాయ్! మరేమో నాకు పావలా కావాలి."

"ఎందుకురా?"

"పనుంది."

"అమ్మని అడగలేదూ...."

"ఇవ్వదు. అందుకనే అడగలేదు." బుంగమూతి పెట్టాడు నాని.

"సరే! యిస్తాను అయితే ఎందుకో మాత్రం చెప్పాలి." అన్నాడు కృష్ణ.

"మరే.... మా బడికి ఓ తెలుగు మాష్టారు వచ్చారు. ఆయన ముసలాడయి

పోయాట్ట. అందుకని యిప్పుడు ఎవరికీ పాఠాలు చెప్పేపని లేదుట. ఈ రోజు మా పిల్లలందరికీ ఏవేవో కథలు చెప్పి నవ్విస్తాట్ట. మేమంతా తలో పది పైసలో.... పావలానో తెచ్చియిచ్చి ఆయనకి సాయంచేయాలిట. 'కష్టాల్లో' వున్నాట్ట. అందుకని."

కష్టమంటే ఏమిటో సరిగా అర్థమయినా తెలియని నాని ఆ పదం ఒత్తి పలికాడు.

కృష్ణ కొన్ని క్షణాలు కళ్ళు మూసుకున్నాడు. మూసిన ఆ రెప్పల వెనుక అపరిచితుడైన ఆ తెలుగు మాష్టారి దీన వదనం కనిపించి కదిలివచ్చినట్టయింది.

'ఓ అపరిచిత ఉపాధ్యాయుడా! నీ కెంత దుర్గతి పట్టింది' మనసులోనే జాలిగా నిట్టూర్చాడు.

అరిచేతిలో పడిన రూపాయి బిళ్ళను చూసి నోరు తెరిచేశాడు నాని.

ఫర్వాలేదు యిచ్చేయ్ అన్నట్టుగా తలవూపేడు కృష్ణ.

విజయగర్వంతో తూనీగలా పరుగు తీశాడు నాని. కృష్ణకు తెలుసు ఆ గర్వం ఎందుకో. పదిపైసలూ, పావలా బిళ్ళల మధ్య రూపాయి మెరిసిపోతూ తన గొప్పతనాన్ని చాటుకుంటూ నానిగాడికీ గొప్పతనాన్ని ప్రసాదిస్తుందని. అందరిలో ప్రత్యేకంగా ఫీలవుతాడు నాని. సరిగ్గా అలాంటి స్వభావమే తనని అప్పుడప్పుడు యిబ్బంది పెడుతోంది.

నిన్నటికి నిన్న జరిగిన పెళ్ళిచూపులు పదిహేనోసారి. ఎందుకు కుదరటంలేదో తెలియదు. జాతకాలు కుదిరి ఫోటో వచ్చాకే వెడుతున్నాడు. నిన్న చూసిన సంబంధం పూర్తిగా కుదిరిపోయినట్టే.... అపరంజి బొమ్మలాంటి ఆ అమ్మాయి తనదైపోయినట్టే అనుకున్నాడు. కాని.... కాని....ఇవాళ పొద్దుటే తెలిసిన కబురు..

'ఇన్ని లక్షణాలు వున్న అబ్బాయి కనీసం ముప్ఫయ్ వేలయినా లేందే పలకడు. అలాంటిది 'కానీ' కట్నం పుచ్చుకోకుండా చేసుకుంటా నంటూంటే మాకు అనుమానంగా వుంది. ఏం లొసుగులున్నాయో ఏమిటో.... డబ్బుకు కక్కుర్తిపడి పిల్లగొంతు కోయలేం.'

నవ్వాలో ఏడవాలో తెలియలేదు కృష్ణకు. 'ఆదర్శాలు మాట్లాడటానికీ, వినటానికీ మాత్రమే బావుంటాయేమో. ఆచరణలో పెట్టాలని చూస్తే అపహాస్యాల పాలు అవుతాయి కాబోలు.'

ఆశాభంగం మనసుని వేధిస్తూంటే ఆకలి లేదంటూ భోజనం మానేసి కలతగా పడుకున్నాడు. ఈ రోజంతా సెలవుంది. ఏం చేయటానికీ తోచటం లేదు. ఉత్సాహంగానూ లేదు. అటూ యిటూ నసుగుతూ పొర్లుతుంటే నాని మాటలు గుర్తువచ్చాయి.

టైం చూశాడు. నాలుగయింది. లేచి ముఖం కడుక్కొని తయారై స్కూలువేపు బయలుదేరాడు.

స్కూలు ఆవరణలో.......

"అప్పుడు తెనాలి రామకృష్ణుడు తాతాచార్లు భుజంమీంచి చప్పున దిగి పోయి ఆయన్ని తన భుజాలమీద కెక్కించుకున్నాడు. అప్పుడేమో...."

శ్రోతగా కొన్ని క్షణాలు నిలబడి పోయాడు కృష్ణ.

పిల్లలందరు పొట్టలు చేత్తోపట్టుకుని పడిపడి నవ్వుతున్నారు. వాళ్ళ ఎదురుగా కుర్చీలో కూర్చుని హావభావాలతో రక రకాలుగా కంఠస్వరం మారుస్తూ బహు పాత్రాభినయం చేస్తూన్న వ్యక్తికేసి చూశాడు కృష్ణ. ఎర్రగా, సన్నగా వున్నాడు. తల వెంట్రుకలు బాగా పండి పోయి వున్నాయి. వెనక చిన్న పిలక. వయసును మించి వడిలినట్లున్న శరీరం ఆయనను కృంగదీస్తున్న బాధలకు సాక్ష్యంగా వుంది.

మేష్టార్లు యిద్దరు ముగ్గురు పలుక రించటంలో వాళ్ళతోపాటు కబుర్లలో పడిపోయాడు కృష్ణ. ఓ అరగంట తర్వాత యింటికి తిరిగివస్తూంటే....

"ప్రత్యక్ష రామాయణాన్ని చూపు తున్నాడు కదా. అందుకని తోకకు బట్టలు చుట్టి నూనెలో ముంచి నిప్పంటించు కుని........"

"హూ"....అంటూ పిల్లలు ఒకటే అరుపు, నవ్వులు....

"ఇలా ఎందర్ని నవ్వించగల్గితే ఆయన నవ్వగలుగుతాడు .... యిలా ఎంతమందికి కాలక్షేపం యిస్తే ఆయన కాలం గడుస్తుంది ...." అనుకుంటూ వెడుతున్న కృష్ణ మనసు అవ్యక్తమైన ఆవేదనతో కలతచెందింది.

ఏవో మాటలు వినిపించినట్లయి చప్పున మెలకువ వచ్చింది కృష్ణకు. అన్నయ్య రాకకోసం ఎదురుచూస్తూ అలాగే నిద్రలోకి జారిపోయాడు తను. అన్నయ్య వచ్చినట్టుంది.

"జానకీ ! వీరు రామనాథంగారని మా చిన్నప్పటి మేష్టారు. మనకి చాలా చాలా కావలసినవారు. బజార్లో కనబడితే తీసుకొచ్చాను...మేష్టారూ...నా భార్య... జానకి...." శేఖరం పరిచయం చేస్తు న్నాడు.

"న మ స్కా ర మం డి" జానకి అంటోంది.

"దీర్ఘ సుమంగళీభవ. ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధిరస్తు" గంభీరమైన కంఠస్వరం.

"కృష్ణా.... ఒరేయ్ కృష్ణా........" అన్నయ్య పిలుపు విని చప్పున నిద్ర నటించేశాడు.

"నే పిలుస్తాను గానీ మీరు రండి వడ్డించేస్తాను" జానకి అంటోంది.

వదిన వచ్చి లేపేవరకు అలాగే పడుకునుండి పోయాడు.

భోజనంచేస్తూ ఆ మేష్టారుని నిశి తంగా చూశాడు కృష్ణ. ఇప్పుడాయన ముఖంలో సాయంత్రం తను చూసిన

ఉత్సాహం, సంతోషం, చురుకు ఏవీ కనిపించటంలేదు. కల్పనల్లోంచి బయటపడ్డ మనిషి, వాస్తవం భయపెడుతున్న మనిషి ఎలా వుంటాడో సరిగ్గా అలాగే వున్నాడు.

తను చెప్పే కథల్లో లీనమయిపోయి అందులోని పాత్రలుగా మారిపోయి, తను నవ్వి, పదిమందిని నవ్వించిన మనిషి ఇతడేనా....అన్పించింది కృష్ణకు.

"సంబంధాలు చూస్తున్నాం మేష్టారూ. ఏదీ కుదరటంలేదు."

శేఖరం మాటలకు విస్తుపోతున్నట్టు చూశాడాయన.

'ఇన్ని లక్షణాలు కలిగివున్న మగపిల్లవాడికికూడా సంబంధాలు కుదరటంలేదా....'

"అన్నయ్యకేం పనిలేదు. ఇంటికొచ్చే ప్రతివాళ్ళతో యిదే ప్రసంగం.." గబగబా ముద్దలు కలిపి నోట్లో కుక్కుకోటంద్వారా తన అసహనాన్ని ప్రదర్శించేడు.

హాలులో కూర్చుని తాంబూలం వేసుకుంటూ రామనాథంగారు తన చేతిసంచీలోంచి ఓ పుస్తకం తీసి అందులోంచి ఓ కవరులాగి శేఖరం కిచ్చాడు. 'ఫోటో.'

"మా అమ్మాయి, తులసి. ఇంటరు చదివింది. పందొమ్మిదేళ్ళు. ఓ అయ్య చేతిలో పెట్టాలని చూస్తున్నాను. తూగలేకుండా వున్నాను" ఆయన కంఠం కంపించింది.

కుతూహలంగా చూశాడు కృష్ణ. శేఖరం అందించాడు. ఫోటోలో అమ్మాయి చాలా అందంగా వుంది. పదహారణాల తెలుగు పడుచులా లేతగా, సన్నగా.... అందంగా.... నాజూగ్గా.... అచ్చం తెలుగు మేష్టారుగారి అమ్మాయిలాగే వుంది. అలాంటి అమ్మాయి తనకి తటస్థపడినట్టు లేదు. జానకి రావటంతో వదినకి అందించాడు. గదిలోకి వెళ్ళి మంచంమీద పడుకున్నాడన్న మాటే గానీ అతడి హృదయం, ఆలోచనలూ ఆ ఫోటో చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి. ఎదురుగా చూస్తే యింకెంత బాగుంటుందో ....తన కిస్తారేమో... అన్నయ్య అడిగితే బాగుండును....

ఈమారు శ్రద్ధగా హాలులోంచి వినిపించే సంభాషణకై చెవులు రిక్కించాడు.

"జానకీ! మేష్టారు ఎంత శ్రద్ధగా, ఎంత బాగా పాఠాలు చెప్పేవారనుకున్నావు. తెలుగు -క్లాసంటే ఎంతో మందికి నిర్లక్ష్యం కదా. కాని యీయన క్లాసంటే మాత్రం పడిచచ్చేవాళ్లం. పైగా వుండటం కూడా ఎదురింట్లోనే గనక మేము మేష్టారు యింట్లోనే ఎక్కువగా గడిపేవాళ్లం. అమ్మగారు కూడా తన పిల్లలతోపాటు మమ్మల్నీ స్వంత బిడ్డల్లాగే చూసుకునేది. పిల్లలున్న తల్లి ఎదుటివారి పిల్లల్ని అంతగా దగ్గర తీయటం అరుదు. ఎక్కడున్నా సరే భోజనం వేళకు నేను రావాలి, అవిడ



కంచం ముందు కూర్చోవాలి. మొదటి ముద్ద నా కందించిగానీ తినేది కాదు. యింట్లో ఏంచేసినా సరే అందరితోపాటు నాకూ ఓ భాగం తీసిపెట్టేది. వీళ్ళ ఆదరణని, ఆప్యాయతని వదిలిపోలేక మా నాన్నకు అక్కడి నుండి బదిలీ అయినప్పుడు ఎంతగా ఏడ్చామో.... అమ్మాగారయితే రెండు మూడు రోజులు ఎంగిలిపడనే లేదుట. అట్లా దూరమయి పోయిన మేష్టారిని యిన్నాళ్ళకి చూడ గలిగాను...." ఆనందంతో కలిగిన దుఃఖంవల్ల అన్నయ్య కంఠం రుద్ధ మయినట్టు అనిపించింది కృష్ణకు. తనకు మాత్రం ఏమంత గుర్తురావటం లేదు.

ఆరుబయలులో పక్కలు వేసుకున్నారు. మేష్టారి ప్రక్కనే కూర్చున్నాడు శేఖరం. జానకి విసినకర్రతో విసురుతోంది.

శేఖరం అడిగిన ప్రశ్నకు కొన్ని క్షణాల మౌనం తర్వాత నోరు విప్పారు రామనాథంగారు.

"బ్రతకలేక బడిపంతులు అన్నారు. 'బ్రతకలేడు బడిపంతులు' అని వుంటే సరిగ్గా నాలాంటి వారికి అన్వయించేది.

ఆ బ్రతకటం ఎంత భారంగా తయారయిందో పిల్లలు క్రమంగా పెరిగేకొద్దీ తెలిసిరాసాగింది. బ్రతుకు పోరాటంగా తయారయింది. ఈ పోరాటంలో నేను పొందిన మొదటి పరాజయం శేషు పోయినరోజు.... మూసుకున్న కను రెప్పల క్రిందుగా రెండు కన్నీటి బొట్లు జారాయి.

"శేషు పోయాడా...." అప్రయత్నంగా ఆశ్చర్యంగా అడిగాడు శేఖరం.

"అవును. శేషు పోయాడు. నన్ను నిందించలేక.... తనను సమాధాన పరచుకోలేక.... బి. ఎస్సీ చదువుతూ.... మెడిసిన్‌లో సీటు రావడంతో అప్పుడే తను డాక్టరయిపోయినట్లుగా పరుగు పరుగున వచ్చి చెప్పాడు. వాడి కలల కున్న శక్తి వాళ్ల నాన్నకు లేదని తెలిసి కృంగిపోయాడు. మెడిసిన్ ఒక్కటే విద్య కాదని యింకా ఎన్నో వున్నాయని; మనకు అందుబాటులో వున్నది పొందాలని చెప్పిచూశాను. వాడిని అందులో చేర్పిస్తే వెనకున్న యీ పిల్లలందరూ ఒక్క పూట కూడా తిండి తినలేని పరిస్థితి వస్తుందని వివరించి చెప్పాను. దాంతో నన్ను గట్టిగా అడగలేక.... తన కోరిక ఫలించక తీవ్రమయిన ఆశాభంగం భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. బరువు బాధ్యతలు మోయటానికి సహాయంగా అందివస్తాడనుకున్న కొడుకు యిలా అర్థాంతరంగా పోయేసరికి నా మాటెలా వున్నా మీ అమ్మగారు మంచం పట్టింది. చెట్టంత కొడుకు కళ్లముందు నిర్జీవంగా మోడులా మారేసరికి ఆ మాతృహృదయం తట్టుకోలేక తల్లడిల్లిపోయింది. గాయమయితే క్షణాల మీద తగిలింది గానీ అది మానటానికి ఎన్నాళ్లు, ఎన్నేళ్లు పట్టిందో.... జ్ఞాపకాల చిరుగాలి వీచినప్పుడల్లా ఆ గాయం మళ్లీ చెలరేగి సెలవేసి బాధిస్తూ వుంటుంది.

బడిపంతుళ్ళ జీతాల సంగతి నీకు తెలిసే వుంటుంది. బావిభారత పౌరులను తయారుచేసేది బడిపంతుళ్లేనని కీర్తిస్తారు గాని ఆ పంతుళ్ల బ్రతుకులు ఎలా సాగుతున్నాయో, చీకటి బ్రతుకులలో కొట్టుమిట్టాడే యీ పంతుళ్లు భావితరానికి ఎలా వెలుగులు అందించగలరో ఆలోచించగలిగినవాళ్లు ఎవరు? తన పిల్లల్ని తాను వెలుగులోకి తీసుకురాలేని అసమర్థతకు క్రుంగిపోయే ఏ బడి పంతులు మాత్రం ఎదుటి పిల్లల బాగోగులు ఎంతమాత్రం చూడగలుగుతాడు? చాలీచాలని జీతంతో సంసారాన్ని యీదుకొస్తున్న నేను ఏ భరోసాతో యీ పిల్లలను గట్టెక్కించగలను? నా అసమర్థతకు నిరసనగా శేషు నా గుండెల్లో చిచ్చుపెట్టి పోయాడు. ఆ తరువాత.... ఆ తరువాత.... రామూ శేషులా కాకూడదని నా శాయశక్తులా ప్రయత్నించాను. వాడి చదువు, తెలివి, ఆసక్తి, ఆశ

నా చేత అప్పులు చేయించాయి. వాడికి డిగ్రీని తెప్పించాయి. యూనివర్సిటీ ఫస్టున వచ్చాడు. ఇంటి విషయాలు వాడిని వుద్యోగ ప్రయత్నానికి మళ్ళించాయి. అప్పుడే తెలిసింది వాడికి వుద్యోగాలు చేసి సంపాదించటానికి ముందు ఓ పెద్ద మూట కావాలని. లేదా ఓ పెద్దమనిషి మాటయినా కావాలని. మూటలు ఎలాగూ లేవు. కాని 'మాట'లు మాత్రం ఎవ రిస్తారు? మామూలు తెలుగు పండితుడికి రికమెండేషన్ యిచ్చే పెద్దమనిషి ఎవ డుంటాడు. ఇల్లు జరగటమే కష్టంగా వున్న పరిస్థితులతో యింటర్వ్యూలకు డబ్బులడగలేక, యింటర్వ్యూకి వెళ్ళినా వాళ్ళ గొంతెమ్మ కోర్కెలు తీర్చే సాహసంలేక, విసిగిపోయి, వేసారి పోయి చివరికి యీ బడిపంతులైన తండ్రిని వదిలి వుద్యోగాన్ని కొని యివ్వగల ఒక పెద్దమనిషికి యిల్లరికపు టల్లుడిగా వెళ్ళిపోయాడు. ఇప్పుడు వాడున్న స్థితికి నన్ను కన్నతండ్రిగా చెప్పుకోటానికి అవమానపడేంత గొప్ప అంతస్థు వచ్చింది. తన కళ్ళముందు వాడు అవమానపడవలసిన స్థితిలో మే ముండటం భరించలేక ఆ సుపుత్రుడు ఆ వూరినుండి నాకు బదిలీ చేయించాడు. అప్పులు తీర్చందే వెళ్ళలేని పరిస్థితికి తలవంచి వున్న ఆ కాస్త గూడు అమ్ముకుని బయటపడవలసి వచ్చింది.

దీనికి కారణ మేమి? ఈ యిద్దరు కొడుకులూ యిలా దూరమయిపోవటా నికి కారకు లెవరు? నేనా? నా బడిపంతు లుద్యోగమా? చాలీచాలని జీతమా? చదువు, తెలితేటలు చూసి కాకుండా లంచాలు, రికమెండేషన్లు మాత్రమే చూసి వరించే వుద్యోగాలా? యివేవీ లేకపోయినా సరే వెనుకబడిన కుల మయితే చాలుననే యీ యాజమా న్యంలో ఆ కులంలో పుట్టకపోవటమా? ఏది.... ఏది.... ఎవరు?.... ఎవరు...."

భావోద్వేగంతో, దుఃఖంలో.... ఆవే శంలో మేష్టారు వణికిపోసాగారు.

"మేష్టారూ.... మేష్టారూ.... శేఖరం ఆయన్ని భుజాలు పట్టుకుని కుదిపాడు. జానకి పరుగున వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తెచ్చింది. కృష్ణ గది కిటికీలోంచి చూస్తూ అంతసేపూ వింటూన్నవాడల్లా చప్పున బయటికి వచ్చాడు.

రామనాథంగారు సంబాళించుకున్నారు. కొన్ని క్షణాల మౌనం తరువాత మొదలుపెట్టారు.

'ఆ తరువాత.... తరువాత.... వకుళ....'

"వకుళ బావుందా మాస్టారూ" వకుళపేరు వినడంతో శేఖరం ముఖంలో సంతోషం కొట్టొచ్చినట్టు కనబడింది. అప్పట్లో ఎప్పుడూ తన వెంటవెంటే తిరిగే వకుళ....

"రాబోయే ఆ మనిషిని తలుచుకుంటూ

కొత్త చిగుళ్లు తినాలని, మధురమయిన గీతాన్ని ఆలపించాలని వువ్విళ్ళూరిన కోయిల గొంతు తెగిపోయింది...."

"అంటే...." జానకి అడిగింది ఆత్రుతగా.


"వకుళకు మంచి సంబంధం చూడాలని, దాని జీవితం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లాలని కోరుకునే వాళ్లం. కాని యీ కట్నాల బజార్లో పెళ్లి కొడుకుల రేట్లు చూసి కళ్లుతిరిగి పోయాయి. వేలకివేలు ఎక్కడ్నుంచి తేగలను? ఆ 'వేలే' వుంటే శేషు డాక్టరయ్యేవాడు. రాము ఇల్లరికపు టల్లుడుగా వెళ్లిపోకుండా యింటికే కోడలిని తెచ్చేవాడు. పూర్వీకుల ఆర్జితమయిన ఆ యింటిని పరాయి చేతుల్లో పెట్టాల్సిన అవసరమే వుండేది కాదు. ఎలాగోలా లోన్లు తీసుకుని అయినా చేయాలనుకున్నాను. నేను కొనగల శక్తిలో ఒక సంబంధం కుదిరింది. డబ్బు తక్కువనే చూసుకున్నాను కాని ఆ పరిస్థితుల్లో నా ఆలోచన ముందుకు పోలేదు. ఫలితం ఏమిటో తెలుసా? నిండా మునిగేంత అప్పులు కావడమే కాదు అంత కష్టపడి చేసిన ఆ పెళ్లి మూన్నాళ్ల ముచ్చటయి పోయింది....

"ఏమయింది మాష్టారూ...." శేఖరం గొంతులో ఆత్రుత.

"కట్నం తక్కువనే చూశాను గానీ వాళ్ళగురించి ఎక్కువగా విచారించలేదు నేను. శ్రావణ మంగళవారాలు నోమించి కాపురానికి పంపుదామనుకున్న వకుళ నోములు నోచాల్సిన అవసరమే లేకపోయింది. ఎన్నాళ్ళుగానో లోలోపల తినేస్తున్న క్యాన్సర్ వ్యాధిని మరుగుపరచి, కట్నండబ్బుతో అప్పులు తీర్చుకునే వుద్దేశంతో పెళ్ళిచేసుకున్న ఆ మహానుభావుడు నా వకుళ లేలేత జీవితానికి మంగళం పాడేసి వెళ్ళిపోయాడు. కాపురానికి వెళ్ళకుండానే కాలిమట్టెలు, తాళిబొట్టు తీసేయాల్సి వచ్చింది. నా అసమర్థత ఎందరి జీవితాలను బలితీసుకుందో చూశావా. ఇకపోతే వకుళ తరువాత తులసి యింటర్‌తో ఆపేసింది. ఆ తరువాత వాడు వాడు...."

రామనాథం స్మృతిపథంలో చిన్నవాడు 'వాసు' మెదలుతున్నాడు. చదువులో వాడికున్న తెలివి, శ్రద్ధ....

"ఇంటర్‌లో చేరాడు. ఆ సంవత్సరమే భార్య ఆరోగ్యం తలక్రిందులయిపోతుందనే అనుకున్నారు. అప్పటికి ఆరు నెలలుగా జీతాలు అందటంలేదు. వినతిపత్రాలు పైవాళ్ళకు వెడుతూనే వున్నాయి. వచ్చేపోయే అధికారులకు విన్నపాలు వినిపిస్తూనే వున్నారు. కాని యీ బడిపంతుళ్ళను దయతలచిన నాధుడు లేడు. వీళ్ళ గతేమిటని విచారించిన ప్రభువు లేడు. మామూలు బడిపంతుళ్ళను దయతలచిన నాధుడు లేడు. వీళ్ళ గతేమిటని విచారించిన ప్రభువు




లేడు. మామూలు బడిపంతుళ్ళ....నెల నెలా వస్తుంటేనే మూడు మూసి, ఆరు అతికే సంసారాల్లో ఆ జీతాలూ రాక పోతే వాళ్ళెట్లా బ్రతుకుతారు.... అని ఆలోచించిన అధికారి ఒక్కడు లేడు.

పూట గడవని యింట ఆకలే కాదు.. చుట్టూ అప్పుల బాధ....యింట్లో మందు కయినా నోచుకోని తల్లడిల్లే ఆ యిల్లాలు....పుస్తకాలు కొనలేక....వాటి కోసం అస్తమానం స్నేహితులను అడుక్కోటానికి అవమానపడే కొడుకు....శావగ్రస్తలా జీవితం గడిపే కూతురొకతైతే....భవిష్యత్తుమీద రంగు రంగుల కలలుకంటూ వాస్తవాన్ని మరిచి పోవాలనుకునే కూతురొకటి.

ఆ వేళ....

"నాన్నా....జీతం కట్టటానికి యివాళ ఆఖరి రోజు" వాసూ తల వాల్చుకుని అడగలేక అడగలేక అడుగుతున్నట్టుగా మెల్లిగా అన్నాడు.

అప్పటికి పదిరోజులుగా వాడామాట గుర్తుచేస్తూనే వున్నాడు. కాని ఏం చేయటం. యింతో అంతో అదీ యిదీ అమ్మిన డబ్బు కాస్త అత్యవసరమైన మందుల ఖర్చుకు అయిపోయింది. చూస్తూ చూస్తూ నిండు ప్రాణాన్ని ఎలా బలిపెట్టటం ?....

"ఎక్కడయినా చూస్తానురా...." అంతకన్నా నెమ్మదిగా అన్నారు రామనాథంగారు.

అడుగులో అడుగేసుకుంటూ వెళ్ళిపోయాడు వాసు. ఆ రోజంతా ప్రయత్నం చేసి ఎక్కడా అప్పుపుట్టక ఆశతో ఎదురొచ్చే కొడుకుముఖం చూడలేక.... తిరిగి తిరిగి రాత్రి తొమ్మిదిగంటలకు ఇల్లు చేరిన ఆయనకు.... కొడుకు ఎక్కడ ఎదురువస్తాడోనని భయపడుతూ మెల్లిగా యిల్లుచేరిన ఆయనకు....వాడు హాయిగా చాపమీద పడుకుని నిద్రపోటం కనబడి అప్పటికి నిశ్చింతగా వూపిరి పీల్చుకున్నారు. అయినా తెల్లవారుతుందిగా...అప్పుడయినా వాడు అడిగితే... వాడి ఆశలను సమూలంగా త్రుంచివేయగలిగే తన అసమర్ధత....తన నోటి వెంట వచ్చే ఆ రెండక్షరాలు విని వాడి ముఖంలో అలుముకునే నిరాశానీడలు... ఓహ్....

నిద్రపట్టక అటూ యిటూ నసుగుతూ ఏ తెల్లవారుఝామునో కునికిన రామనాధంగారు తెల్లగా తెల్లవారాక గానీ మేల్కొలేకపోయారు. ఆయన భయపడినట్టుగా వాసు ఎదురురాలేదు. ఏ క్షణంలో నయినా ఏ వాకిట్లో నుంచయినా వచ్చి 'నాన్నారూ! జీతం' అంటాడేమోనని వులికులికి పడసాగారు. కాని పొద్దెక్కినా వాడి జాడ లేకపోయేసరికి అప్రయత్నంగా శేషు గుర్తుకు వచ్చి నిలువునా నీరయిపోయాడు ఆయన. వీడు కూడా ఏదయినా అఘాయిత్యం చేయలేదు కదా.' ఈ భావం నిలువెల్లా కంపింపచేసింది. వణికిపోయాడు. ఇంట్లో కెళ్ళి కూతురుని అడిగాడు.

"ఏమో నాన్నా మరి. తెల్లవారుఝామునే లేపమని లేవగానే వెళ్లిపోయాడు. నాకేం చెప్పలేదు మరి."

యిక కాళ్లాడలేదు ఆయనకు. ఒక్కక్షణం నిలుచోలేక వాలుకుర్చీలో చేరగిలబడిపోయాడు.

"ఏ క్షణం ఏ వార్త వినాల్సివస్తుందో భగవంతుడా"అనుకుంటూ చెదిరిపోతున్న మనసుని కూడదీసుకుంటూ....

అంతదూరాన వాసూ కనిపించినట్టయి ఒక్కవుదుటున లేచి గుమ్మంలో కొచ్చిన ఆయన ముఖం వాసూ కళ్లబడగానే ఆనందంలో వెలిగిపోయింది. వాడు ఎక్కివచ్చిన సైకిలు చూసి ఆశ్చర్యంతో విప్పారింది. నిన్నటి డబ్బు విషయం అడుగుతాడేమోనని గుర్తొచ్చి అవమాన భారంతో క్రుంగిపోయి వంగిపోయింది.

వాసూ డబ్బు లడగలేదు. కాని.... 'నాన్నారూ! అదేం ఎండలో నుంచుని వున్నారు. ముఖం తిరిగేను లోపలికి పదండి' అన్నాడు.

రామనాధం మాట్లాడకుండా లోపలికి వచ్చి కుర్చీలో కూలబడ్డారు. ఎదురుగా నిలబడ్డ వాసుకేసి చూస్తూ ఏంమాట్లాడాలో తోచక మళ్లీ చూపులు తిప్పుకున్నారు.

"నాన్నగారూ! మీరు నన్ను క్షమిస్తా నంటే ఒక మాట" అంటూ కాళ్ళ దగ్గరిగా వచ్చి.... మోకాళ్లమీద తలవాల్చి....

"నేను కాలేజి మానేశాను...."

ఉలిక్కిపడ్డారు ఆయన. అప్రయత్నంగా ఆయన చేయి వాసు తలమీదికి పోయింది. ఆ ఒక్క మాట ఆయన మనసును ఏ విధంగా దెబ్బతీసి వుంటుందో గ్రహించగలిగిన వాసూ కళ్లెత్తి చూడలేకపోయాడు.

"నాకు చదవాలని లేదు. అందుకే మానేశాను. యింట్లో వూరికే కూర్చోటం ఎందుకని...."

"ఎందుకని...." రెట్టించారు రామనాథంగారు. ఆ రెట్టింపులో కోపంలేదు. అసహనంలేదు. ఆత్రుత వుంది.... ఆందోళన వుంది. ఆవేదన వుంది.

"ఊరికే వుండటం ఎందుకని పేపర్ బోయ్‌గా చేరాను. అవును. అసలేం పని లేదు. పొద్దుటే వెళ్లిపోయి పేపర్ వ్యాన్ నుండి స్టాకు తేవటం.... తరువాత పేపర్లు, వీక్లీలు యింటింటికీ పంచేయటం అంతా రెండు గంటల పని .... వంద రూపాయి లిస్తారు...."

వాడిముఖంలో కనిపించే ఆ సంతోషం పని గంటసేపేనని గానీ, వంద రూపాయి లిస్తారనిగానీ కాదని కేవలం తను యిష్టంగా తృప్తిగా యీ పనిచేస్తున్నట్టు తండ్రిని నమ్మించటంకోసమే ఆనందం ముఖాన పులుముకున్నాడని....

వీటన్నిటి వెనుకా తను మరి ఎక్కవలసిన అవసరంలేని కాలేజి మెట్లూ.... తనను పరీక్షలకు కూర్చోబెట్టలేని అసమర్థతవలన అంగట్లోకి వెళ్లిపోయిన సాహిత్యపుస్తకాలూ మెదులుతున్నాయని.... కళ్లముందు కదులుతున్నాయని వాడిని కన్నతండ్రిగా తనకు తెలియనివా....

రామనాథంగారు పైపంచతో కళ్లొత్తుకున్నారు.

జానకి పైటకొంగుతో ముఖం తుడుచుకుంటున్నట్టుగా కళ్ళతడి అద్దుకుంది.

ప్రక్కనే మంచంమీద కూర్చుని వింటున్న శేఖరం మనసు గది కిటికీలోంచి చూస్తున్న కృష్ణ మనసు అవ్యక్తమయిన ఆవేదనతో నిండిపోయాయి.

పడుకున్నవారల్లా లేచి కూర్చున్నారు రామనాథంగారు.

యిదీ యీ నిర్భాగ్యుడి జీవితం. దీని వెనుక ఎన్ని కష్టాలు, ఎన్ని కన్నీళ్లు, ఎన్ని వ్యథలు దాగివున్నాయో నాకు తెలుసు. దారిద్ర్యపు పెనుగాలికి యిలా నా బిడ్డల జీవితాలు చెల్లాచెదరయ్యాయి. నా భార్య మంచంమీదే వుంది విముక్తి కోసం చూస్తూ. నాకుమాత్రం ప్రభుత్వం వారు విముక్తి ప్రసాదించారు. రిటైర్ అయ్యాను. అప్పుడప్పుడయినా, ఎప్పుడో ఒకసారయినా వస్తాయనే ఆశవున్న జీతపురాళ్లుకూడా ఆగిపోయాయి. ఇక బడిపంతుళ్ళ పెన్షన్ డబ్బులు రావట

మంటావా వాళ్ళు కాటికివెళ్ళే సమయా నికి వస్తే చాలు కన్న కొడుకులు ఖర్చు లకు వాటాలు వేసుకోనవసరం లేకుండా, కర్మలు చేయటానికి చందాలు వేయ కుండా...." రామనాధంగారి కంఠం దుఃఖంతో పూడుకుపోయింది.

"బాధ పడకండి మాష్టారూ" శేఖరం అనునయంగా అన్నాడు.

"నిండా మునిగినవాడికి చలెందుకు శేఖరం? ఇప్పుడు నాకున్న బాధల్లా ఒకటే. తులసి జీవితమన్నా శోభాయ మానంగా వెలగాలని. దాని జీవనలత కన్నా సరైన పందిరి సమకూర్చాలని. నా ధ్యేయం అదే యిప్పుడు. కాని.... కాని.... కాని.... వాసూ కొచ్చే వంద రూపాయలతో సంసారం జరగటమే ఎంతో దుర్లభంగా వుంది. ఇక తులసి పెళ్లి గురించి ఆలోచించే సాహసం ఎక్కడ్నుంచి వస్తుంది. ఏమయినా సరే, ఏం చేసయినాసరే దాని బ్రతుకు పండిం చాలి. అందుకే........అందుకనే........ చూశావా...." అంటూ రొంటిన దోపు కున్న చిన్న సంచీ నొకదాన్ని తీసి, దారం వూడదీసి తెల్లటి దుప్పటిమీద విదిలించారు రామనాధంగారు.

జానకి, శేఖరం, కృష్ణ అలా ఆశ్చ ర్యంగా చూస్తూండిపోయారు. వెన్నెల్లో ఆ తెల్లటి దుప్పటిమీద మెరుస్తూ.... చిందరవందరగా, చెల్లాచెదురుగా .... నాణాలు ఐదు, పది, పావలా కాసులు, అర్ధ, రూపాయి బిళ్ల....

ఆయన కళ్లనుండి జారిన రెండు అశ్రుబిందువులు ఆ పైసలమీద పడటం అందరూ గమనించలేదు కాని ఆ నాణాల మధ్య తము యిందాక చూసిన ఫోటో లోని అమాయకమైన ముఖం మాత్రం దీనంగా చూస్తున్నట్టు కనిపించింది వాళ్ళకు.

నేను చేస్తున్నపని ప్రస్తుతం యిది. ఇలా వూరూరూ తిరిగి సంపాదిస్తున్నాను. చిన్నచిన్న చినుకులు కలిసి వాగులుగా, వంకలుగా మారటం లేదా. అలాగే.... యీ చిల్లరంతా పోగయి.... పెద్ద మొత్తమయి....

"మాష్టారూ! మీరు ఆవేశపడకండి. ఇక అలిసిపోయారు. పడుకోండి. రేపు మాట్లాడుకుందాం" శేఖరం అన్నాడు.

"లేదు శేఖరం. రేపు వుండటానికి వీలుపడదు. ఉదయమే బస్సుకు వెళ్ళి పోవాలి. ఏమనుకోకు. మళ్ళీ ఎప్పు డయినా కలుస్తాను."

శేఖరం మరేం మాట్లాడలేక పోయాడు.

"అమ్మా, జానకీ! కాసిని మంచి నీళ్ళివ్వు. త్రాగి పడుకుంటాను."

జానకి లోపలి కెళ్ళింది. వెనకే శేఖరం వెళ్లాడు. కృష్ణ అలా కిటికీ లోంచి చూస్తూ ఆలోచిస్తూ నుంచు న్నాడు.

"కృష్ణా!"



చప్పున వెనక్కు తిరిగి చూశాడు. 'జానకి.'

"ఏం వదినా"

"నీ కా ఫోటోలో అమ్మాయి నచ్చిందా" నెమ్మదిగా అడిగింది జానకి.

కృష్ణ గుండెలు ఆనందంతో రెప రెప లాడాయి. కాని వెంటనే జవాబు యివ్వలేక పోయాడు.

"నీకు నచ్చితే మాష్టారు నడుగుదాం"

"మరి అన్నయ్య...."

"ఆయనే నిన్నడిగి తెలిసికొని రమ్మన్నారు."

"వదినా! నాకు బాగా నచ్చింది. అయితే కట్నం విషయం...."

"తెలుసులేవయ్యా, నీ ఆదర్శం. ఆయన యింతసేపు చెప్పింది వినికూడా యింకా కట్నం అడుగుతామనుకున్నావా. ఆయనికి సాయం చేసినట్టూ వుంటుంది, నీ ఆశయం నెరవేరినట్టూ వుంటుంది కదూ."

"అవును వదినా! మంచి ఆలోచన. అన్నయ్యను అడగమని చెప్పు. నా కిష్టమే."

జానకి వెళ్ళిపోయింది. మళ్ళీ కిటికీ

లోంచి ఆత్రతగా చూడసాగాడు కృష్ణ.

శేఖరం మంచినీళ్ళ గ్లాసందుకుని పక్కన పెడుతూ "మాష్టారూ ఒక మాట" అన్నాడు.

"ఏమిటయ్యా! చెప్పు."

"మీరేం అనుకోకండి. మీ కిష్టమయితేనే....మీ తులసిని మా కృష్ణకు యిస్తే...." చెప్పిన శేఖరం భుజాలు పట్టుకున్నారు ఆయన.

"నాయనా! శేఖరం .... ఏమిటి.... నువ్వంటున్నది నిజమేనా...."

"నిజమే మాష్టారూ....మా కందరికీ యిష్టమే. మీరు కానీ కట్నం యివ్వొద్దు. వాడికి కట్నం తీసుకోకుండా పెళ్లి చేసుకోవాలని కోరిక. అమ్మాయి నచ్చింది. మీరు సింపుల్‌గా ఏ గుళ్లో పెళ్లి చేసినా మాకు సమ్మతమే.... మీరు ఒప్పుకుంటే...."

"శేఖరం....ఈ దినం ఎంత సుదినమయ్యా....నేను ఒప్పుకుంటే....అంటూ సందేహంగా అడుగుతున్నారా.... మా తులసి మీ యింటికి రావటం కన్న అదృష్ట మేముంది. ఇంత సంబంధం నేను తీసుకురాగలననే అనుకుంటున్నావా....నా కింతకన్నా మంచి అవకాశం వస్తుందా....శేఖరం మీది ఎంత గొప్ప మనసులు...." మాట్లాడుతూండగానే పట్టరాని సంతోషంలో, ఆనందంలో దుఃఖంకూడా కలిసొచ్చి ఆయన కంఠం రుద్ధమయింది.

"మీ రంతగా పొగడవలసిన గొప్పతనమేమీ లేదు మాష్టారు. మావాడికి నచ్చింది. అందుకే అడిగాం. మీరూ మీ వాళ్ళతో ఆలోచించి....అమ్మాయిని కనుక్కొని...."

"అదృష్టం తలుపుతట్టి పిలుస్తూంటే ఆలశ్యం చేసేవాడుంటాడా. నేను రేపు నేరుగా మా యింటికే వెళ్ళి సంబంధం ఖాయపరుస్తూ నేను పుత్తరం వ్రాస్తాను సరేనా....నీ మేలు మరిచిపోలేను శేఖరం...."

"మాస్టారూ! ఒక్క విషయం. నేనూ, జానకి రేపు మావాళ్ళ పెళ్లికి వెడుతున్నాం. వారం, పదిరోజులు పట్టవచ్చు. మీరు ఆ పుత్తరమేదో తమ్ముడికే వ్రాస్తే...."

"అలాగే నాయనా....అడ్రస్ వ్రాసి యివ్వు....నేను వెళ్ళగానే వ్రాస్తాను."

తెల్లవారు ఝూమున ప్రయాణానికి సిద్ధమయ్యారు రామనాథంగారు. ఆయనకెంతో సంతోషంగా వుంది. నిన్నటి దిగులు, దైన్యం మచ్చుకయినా కనిపించటంలేదు.

శేఖరం కవరొకటి యిస్తూ "మాష్టారూ! యిందులో తమ్ముడి ఫోటో, అడ్రసూ వున్నాయి. మీ వాళ్ల కూడా చూడనీయండి. మీరు త్వరగా ఏ సంగతీ పుత్తరం వ్రాస్తే....

"ఏ సంగతీకాదు శేఖరం. ఖాయం చేస్తూ వ్రాస్తాను. సరేనా...."

కవరు నందుకుని తన చేతి సంచీలో పెట్టారు.

"యిక వెళ్ళిరానా .... అమ్మా .... జానకీ వెళ్ళొస్తాను...."

"మంచిది మాష్టారూ..మంచిదండీ.." శేఖరం, జానకి చేతులు జోడించారు.

అప్రయత్నంగా గదివేపు చూశారు రామనాథంగారు.

చప్పున చేతులు జోడించాడు కృష్ణ.

'ఆ అబ్బాయిని తను మాట్లాడించనే లేదు' గుర్తొచ్చింది అయనకు అప్పుడు. ఇప్పటికిప్పుడు మాట్లాడటం భావ్యమని పించక 'వెళ్లొస్తా నబ్బాయ్' అన్నారు ప్రీతిగా చూస్తూ.

"మంచిదండీ" వినయంగా అన్నాడు కృష్ణ.

సంచీపట్టుకు బయలుదేరిన రామనాథం వెనకాలే నాలుగడుగులు వేశాడు శేఖరం.

"యిక నీవు నిలబడు శేఖరం" భుజం మీద చేయివేస్తూ అన్నాడాయన.

"అలాగే మాష్టారూ. మీరు వెళ్ళగానే వుత్తరం వ్రాయండి. వుంటానూ...." వంగి నడుస్తూ వెళ్లిపోతున్న మాష్టారు కేసి చూస్తూ కొన్ని క్షణాలు అలాగే నిలబడిపోయాడు శేఖరం.

మేస్టారు వూరెళ్లి నాలుగురోజు లయింది. రెండు రోజులపాటు వుగ్గబట్టు కున్న ఆత్రుత ఆ తరువాత వుధృత మయింది. రోజూ పోస్టుకోసం ఎదురు చూడటమే. ఆ తరువాత ఓ దినం పోస్ట్ మాన్ కవరు తీసుకురావటం చూసిన కృష్ణ మనసు అనిర్వచనీయమైన అను భూతితో నిండిపోయింది.

ఏకాంతంగా కూర్చుని వుత్తరం బయ టికి తీశాడు. కవరుమీది అడ్రసు తనదే కాని లోపలి వుత్తరం అన్నయ్య శేఖ రానికి వ్రాసివుంది. కళ్లు అక్షరాలవెంబడి పరుగు పెడుతున్నా అతడి మనసు....

"ప్రియమైన శేఖరం...."

మీ కుటుంబానికి మీ యీ చిన్నప్పటి మేష్టారి ఆశీర్వచనములు. నా యీ ఉత్తరం కోసం మీరు ఎదురుచూస్తూ వుంటారని తెలుసు. కాని నేను అను కున్నవిధంగా వెంటనే వ్రాయలేకపోయి నాను. మరోలా భావించకు.

నీవు మీ కృష్ణకు తులసి నడిగిన విషయం యిక్కడి కొచ్చాక ఆలోచింప దగిన విషయంగా మారుతుందని నే నక్కడ అనుకోలేదు. కోరి అదృష్టం తలుపుతెరిచి ఆహ్వానిస్తున్నట్టుగా మీరు అడుగుతూంటే ఆలోచించి చెబుతా ననడం మీ రిచ్చే ఆ వరాన్ని కించపరిచి నట్టు అవుతుందని, నాకు అహంభావాన్ని అంటగడుతుందని అనిపించింది. అందుకే సంతోషం యీ పిడికెడు గుండెలో మూటగట్టుకుని వచ్చాను.

ఈ విషయం ఇంట్లో చెప్పాక ఎవ్వరం భోజనమయినా చేయలేకపోయాం. ఎందు కంటావ్. ఆనందంతో, తృప్తితో కడు పులు నిండిపోయి, మంచంమీదున్న మీ

అమ్మగారు కూడా లేవలేని స్థితిలో వున్నందున గంతులు వేయలేకపోయింది గానీ, బలహీనమయిన ఆమె గుండెలు కూడా లేనిబలం తెచ్చుకుని ఆనందంతో పురాతన లూగాయని మాత్రం చెప్ప గలను. ఇవన్నీ ఎందుకు వ్రాస్తున్నా నంటావా. నీవు చెప్పిన ఆ ఒక్క మాట మా బ్రతుకులకు ఎంత తీపిని పంచిందో తెలియచేయటానికి.

కాని శేఖరం...ఇప్పుడు నేను వ్రాయ బోయే విషయం నీకు బాధ కలిగిస్తుం దేమో. అయితే యీ బాధ నీకు తాత్కా లికమే ననుకో. నీవు 'ఊ' అనాలే గానీ 'కో' అంటే 'కోటి' మంది వుంటారు నాలాంటి వాళ్ళు. ఆ కోటిలో నే నొకడిని కాకుండా ఎందుకు తప్పుకుంటున్నానని నీ వనుకోవచ్చు. నే వ్రాసింది చదివితే నా హృదయం నీకు వ్యక్తమవుతుంది.

నేను మీ యింట్లో భోజనంచేసిన ఆ రాత్రి ఆరుబయట కూర్చుని నా కథంతా వినిపించాను. నాతోపాటు యింకో మూడు జతల కళ్లు తడిఅయ్యా యని, ముగ్గురి గుండెలు ఆర్ద్రమయినా యని నాకు తెలుసు.

నా బ్రతుకు యిలా దరిద్రదేవత పాదాలక్రింద నలగటానికి, నేను ప్రపం చంలోకి తెచ్చిన నా పిల్లలు ఆశల రెక్కలు తెగి నేలకూలిన పక్షుల్లా అవ టానికి కారణమేమిటి ? ఎదుగూబొదుగు లేని వుద్యోగమా, చాలీచాలని జీతాలా, నాలాంటి శ్రమజీవుల బాగోగులు పట్టించుకోని ప్రభుత్వమా....?

ఒకప్పుడు ఎంతో పూజ్యభావంతో యీ ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాను. నాకు బ్రతుకుతెరువుగా ఏర్పడి, గౌరవా న్నందిస్తున్న యీ వృత్తిని నేనూ ఎంతో గౌరవించాను. నా ఉద్యోగానికి నేను న్యాయం చేయాలని చిత్తశుద్ధితో పనిచేశాను. కాని....కాని....యీ వృత్తి మీద గానీ, చేస్తున్నవాళ్ళమీద గానీ ఎంతమందికి గౌరవముంది, ఎంతమందికి శ్రద్ధ వుంది. ఎన్నెన్నో సమస్యలను పరిష్కరించే యీ ప్రభుత్వం మా గురించి ఎంతవరకు ఆలోచిస్తోంది. మా అవసరాన్ని ఎంతవరకు గుర్తిస్తోంది. నెలనెలా జీతాలు రాని పంతుళ్లు కొంద రయితే, సంతకాలుమాత్రం పూర్తి జీతా లకు పెట్టేసి 'వి'నాయకుల దాక్షిణ్యం కొద్దీ అందించే సగమో, పాతిక భాగమో మాత్రమే జీతాలు జేబుల్లో దోపుకుని మనసులు ఏడుస్తున్నా ముఖాల నవ్వులు పులుముకుని, ఆ అధికారులకు ఓ అంజలి సమర్పించి యిచ్చిందే చాలునని కాళ్ళు యీడ్చుకుంటూవచ్చే పంతుళ్ళు కొందరు. ఆర్థికపునాదులు యింత బలహీనంగా వుండే పరిస్థితులలో యీ బడిపంతుళ్ళు తమ జీవితాల్లో ఏమాత్రం నిలదొక్కుకో గలుగుతారు? ఏ మాత్రం సౌకర్యం అను భవించగలుగుతారు. వాళ్ళ తెలివితేటలు, ఓర్పు, శ్రద్ధ, ఎంతవరకని వాళ్ళను

అంట పెట్టుకుని వుంటాయి? సమస్యల చిక్కుముడుల మధ్య బంధింపబడిన ఏ బడిపంతులు మాత్రం భావిభారత పౌరులను ఎలా తయారుచేస్తారు? తన జీవితం, తనసంసారం, తన పిల్లలను తీర్చిదిద్దుకోలేని నిస్సహాయతలో ఎదుటి వాళ్ళను చైతన్యవంతం చేయడానికి శక్తి ఎక్కడిది. చమురుంటేనే కదా వత్తి వెలిగేది. వెలగ కలిగితే గదా ప్రకాశాన్ని అందించేది. ఆ చమురే లేనపుడు తానే కొడిగట్టుకుపోయి మసిబారుతుంటే వెలుగుకు తావెక్కడుంది?

శేఖరం! యిన్ని విషయాలు ఎందుకు వ్రాస్తున్నానంటావేమో. నీవు బాగా అర్థం చేసుకోవటానికి. అపార్థం చేసుకోకుండా వుండటానికి నా మనసు, అందులోని భావం నీకు పూర్తిగా అవగతం కావాలని.

కృష్ణ ఫోటో చూశాకా, కానీ కట్నం లేకుండా చేసుకుంటామని మీరంతట మీరు పిల్లనిమ్మని అడిగారన్న మాట విన్నాక మా యింట్లో అందరికీ అందలం ఎక్కినట్లయిపోయింది. తులసి అప్పుడే పెళ్ళికూతురయిపోయినట్టుగా సిగ్గుల మొగ్గయి పోయింది. వెంటనే ఆ క్షణమంటే ఆ క్షణమే మీకు అంగీకారం తెలుపమని ఏకాభిప్రాయం వెలిబుచ్చారు.

ఆ మాటలే వుత్తరం వ్రాశాను గుండెనిండా పొంగి పొర్లే సంతోషంతో. వ్రాస్తూన్నంతసేపూ యిక మీరు వచ్చేస్తారని, వివాహం నిశ్చయమయిపోతుందని, తాంబూలాలు పుచ్చుకుంటున్నట్టు, పందిళ్లు వేసినట్టు, బాజాలు మ్రోగినట్టు నా భావనలన్నీ దృశ్యాలుగా రూపొందింపబడి కళ్ళముందు కదలాడుతుంటే కళ్ళనిండకూడా నీళ్ళు నిండిపోయాయి ఆనందం పట్టలేక. వ్రాసిన ఉత్తరాన్ని కవరులో పెట్టి అడ్రస్ వ్రాయటానికని నీ విచ్చిన కవరులో అడ్రస్ కోసం చూశాను.

ఆ అడ్రస్....నీ విచ్చిన నీ తమ్ముడి చిరునామా....చూసిన క్షణాన నా నవనాడులు కృంగిపోయాయి. నా ఒంట్లోని రక్తమంతా నీరయిపోయినట్టు అనిపించింది. అందమైన ప్రపంచంలోకి క్షణాల మీద ఎలా అడుగుపెట్టానో, అలాగే క్షణాల మీదే ఆ ప్రపంచంలోంచి శూన్యంలోకి వచ్చినట్టయింది. ఎందుకా అని ఆశ్చర్యపడిపోతున్నావుకదూ. నీ తమ్ముడు....నీ తమ్ముడు.... ఒకప్పుడు నేను కోరి ఎన్నుకుని, అనుక్షణం గౌరవించి, పూజ్యభావంతో అడుగు పెట్టి.... యిప్పుడు... యిన్నేళ్ళ తరువాత ప్రతి క్షణం దేన్నయితే అసహ్యించుకుంటున్నానో, దేన్నయితే కసితీరా నిందిస్తున్నానో, ఏదయితే నా దరిదాపులకు రాకూడదని కోరుకుంటున్నానో సరిగ్గా అలాంటి...అలాంటి వృత్తిలో....అంటే మామూలు బడిపంతులుగా వుండటమే... అదే....దానినే....నేను భరించలేకపోయాను. వ్యథాభరితమయిన నా

హృదయం నిముషాలమీద నన్ను శక్తి హీనుణ్ణి చేసేసింది.

నన్ను మన్నించు శేఖరం! తులసిని మీ తమ్ముడికి యివ్వలేను. నా నిరాకరణ నీకు అసహజంగా కనబడి ఆగ్రహం తెప్పించవచ్చు. నాది తెలివి తక్కువతనంగా కనబడవచ్చు. కాని ఒక ఆడపిల్ల తండ్రిగా....అదీ బడి పంతులుగా యీ బ్రతుకుతో పోరాడి, అలసిపోయి, జీవితంలో ఒడిదుడుకులు బాగా ఆకళింపుజేసుకున్న అనుభవజ్ఞుడిగా.... నేను యీ సంబంధాన్ని అంగీకరింపలేకున్నాను. నా దారిద్ర్యపు,నిస్సారపు బ్రతుకు నా కూతురికి వారసత్వంగా రావటం కన్నతండ్రిగా నేను భరించలేను. నాలాంటి బడిపంతులుకే నా కూతురిని యిచ్చి నాలాంటి దౌర్భాగ్యమే నా బిడ్డకు కానుకగా యివ్వలేని యీ కన్నతండ్రి మనసుని అర్థంచేసుకో.

ఇందులో నీ తమ్ముడిని తక్కువచేసి మాట్లాడా ననుకోకు. ఇప్పుడు వాళ్ళ బ్రతుకులు మెరుగుపడి వుండొచ్చు. వాళ్ళ జీవితాలు నాలాగా కాకుండా బాగానే వెలగవచ్చు. అయినా నాకు కలిగిన అనుభవాలమూలంగా నేనా ధైర్యం చేయలేకున్నాను. సాహసించటానికి నాకు శక్తి లేదు. నీ తమ్ముడి వృత్తి, అదే అతడి వుద్యోగం ఒకప్పుడు ఎంతో ప్రియంగా నేను చేసిన వుద్యోగమే. అంత పూజనీయమయిన, గౌరవమయిన వృత్తిని యీనాడు నేనే యింతగా నిరసిస్తున్నానంటే నేనెన్ని బాధలకు గురయి వుంటానో.... ఎన్ని కన్నీళ్ళు కార్చి వుంటానో, ఆ కన్నీటిలో నా కలల పడవలు ఎన్ని మునిగి కొట్టుకుపోయాయో, ఎంతటి వ్యధను మోసి వుంటానో వూహించి చూడు. నా గాథని విన్నావు కదా. ఒక్కసారి నా శేషుని.... రాముని....వకుళను....వాసూను గుర్తు తెచ్చుకుని చూడు. ఈ కన్నతండ్రి గుండెలు ఎంతగా కాలిపోతున్నాయో అర్థంచేసుకోగలితే నామీద కోపం తెచ్చుకోవు. నన్ను నిందించవు.

శేఖరం! నా కాళ్ళలో యింకా శక్తి వుంది. నా కంఠంలో యింకా స్వరం వుంది. నా తలలో ఎన్నో కథలు నిక్షిప్తమయ్యే వున్నాయి. ఈ కాళ్లు చచ్చుపడే వరకు, యీ కంఠం మూగపోయేవరకు వూరూరూ తిరుగుతాను. స్కూలు స్కూలుకూ వెళ్ళి కథలల్లి చెబుతాను. పద్యాలు పాడతాను. చిల్లర డబ్బుల కోసం జోలె కడతాను. ఒక్కో చినుకే కలిసి వాన్నై, ఏర్రై, సముద్రమయినట్లు యీ పైసలు, పావలాలు రూపాయలుగా మారిననాడు....ఏదో ఒకనాడు యిదంతా పోగేసి నా కూతురికి మంచి స్థితిపరుడిని....కాకుంటే గొప్ప ఉద్యోగస్థుడిని, అంటే బడిపంతులు కాకుండా మరే ఉద్యోగి అయినా సరే చూసి పెళ్ళిచేస్తాను. అలా చెయ్యాలని నా ఆశ. నా ఆశను

అర్థంచేసుకోగలవు కదూ.

ఉత్తరం ముగించబోతూ యింతకు ముందే నీకు వ్రాసిన ఉత్తరం తీసి చదివాను. ఈ పెళ్లి మా అందరికీ సమ్మతమేనని, మా పాలిట వరమని, మీరు వీలయినంత త్వరగా నిశ్చయ తాంబూలాలకు రమ్మని ఆహ్వానము.

ఆనందంతో వణుకుతున్న చేతులతో వ్రాసిన ఆ ఉత్తరాన్ని....ఆ ఉత్తరాన్ని ఆ చేతులతోనే చింపేశాను. వ్రాసినపుడు ఆనందం పట్టలేక యీ కళ్లు తడిశాయి. కాని.... యిప్పుడు ....యిప్పుడు....యీ చేతులయితే ఆ వుత్తరాన్ని అంత కర్కశంగా చింపాయిగానీ, ఆ చర్యమూలంగా నా కడుపులో రగిలిన ఆవేదన కన్నీటి రూపం దాల్చి కళ్ళద్వారా బహిర్గతమయి ఆ ముక్కలమీద జారిపడి ఆ అక్షరాలు చెరిగిపోతుంటే నా గుండెను ఎంతగానో చిక్కబట్టుకోవలసి వచ్చింది.

శేఖరం! నీవు నాకన్నా చిన్నవాడివి. పైపెచ్చు నా శిష్యుడివి. నిన్ను క్షమించమని అడగకూడదు. అయినా యిప్పుడు అడుగుతున్నాను. నా మీద కోపం తెచ్చుకోవద్దు. నన్ను నిరసించవద్దు. నీ దృష్టిలో నా నిర్ణయం మూర్ఖమైనదిగా కనిపించవచ్చు. కనిపిస్తుంది కూడా. నీ విచ్చిన అవకాశాన్ని జారవిడుచుకుని, ఏదో పోరాడి గెలవాలన్న భ్రమలు. యీ పోరాటంలో నేను గెలవలేక పోవచ్చు. అయినా చివరి క్షణంవరకూ రాజీపడకుండా నా బిడ్డ సుఖంకోసం పోరాడానన్న ఆత్మతృప్తి నాకు మిగులుతుంది....

నా అనుభవరీత్యా యిప్పుడు నేను తీసుకున్న యీ నిర్ణయం సవ్యమయినదేనని నా అభిప్రాయం. నీవు మా చిన్నప్పటి శేఖరానివే అయినప్పుడు తప్పకుండా నన్ను, నా మనసును అర్థం చేసుకోగలుగుతావు. ఈ తిరస్కృతిని మన్నించ గలుగుతావు.

చి॥ కుం॥ సౌ॥ జానకికి కూడా నా క్షమార్పణలు తెలుపవలసింది. ఇక వుంటాను.

ఇట్లు,

ఆశీర్వచనములతో

మీ ప్రియమైన మాష్టారు.

కృష్ణ చేతుల్లోంచి వుత్తరం జారిపోయింది. కాగితాలు గాలికి రెపరెప కొట్టుకుంటూ క్రిందపడ్డాయి. తడిసిన కళ్ళతో వంగిచూసిన కృష్ణకు ఆ కాగితాల్లోని అక్షరాలు మసకబారినట్టు కనిపించేయి. మసక కళ్ళమధ్య తులసిరూపం అస్పష్టంగా కనిపించి అదృశ్యమైపోయింది.

———